ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 24 జూలై 2025

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణం పనులకు స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దాసరి తిరుపతి గౌడ్ కాలనీ వాసులతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అడిగిన వెంటనే నిధుల మంజూరు చేపించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

రాయికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. వ్యవసాయంలో మెళకువల గురించి విద్యార్థులు రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం మన నిత్యంలో ఒక భాగమని, ఉపాధ్యాయులు విద్యార్థులను వ్యవసాయ పనుల అవగాహన కోసం క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, ఉపాధ్యాయులు అక్కినపెల్లి సతీష్, రమేష్, సాయికృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12లక్షల ఈజీఎస్ నిధులతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల దగ్గరకు వెళ్లి వారితో ముచ్చటించారు. డిజిటల్ పాఠ్యాంశాలను విద్యార్థులు ఉపయోగించుకొని తమ లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ లక్ష్మారెడ్డి, జాజాల జగన్‌రావు, కంఠం రమేష్, నేమూరి సత్యనారాయణ, జెడి సుమన్, సున్నం సత్యం, చిన్నారెడ్డి, రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సతీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ జిల్లాలో బుధవారం విజయవంతం అయ్యింది. విద్యార్థి సంఘాల పిలుపు, విజ్ఞప్తి మేరకు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు బంద్‌కు సహకరించడంతో తరగతుల నిర్వహణ సాగలేదు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు పలు పాఠశాలలను సందర్శించి బంద్ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఆధునికీకరించాలని, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. అలాగే యుద్ధ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అక్రమాలిక్, సంజయ్, ప్రణయ్, ఆసిఫ్, వినయ్, ప్రవీణ్, శ్యామ్, భార్గవ్, శివ, దినేష్ తదితరులున్నారు.

రైతులకు సరిపడా యూరియా అందజేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

మెట్‌పల్లి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా యూరియా అందజేయాలని నిర్వహకులకు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని జిల్లా సహకార సంఘం అధికారి మనోజ్‌తో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సహకార సంఘంలోని రికార్డులు, ఈపాస్ మిషన్, ఎరువుల గోదాం, స్టాక్‌ను పరిశీలించి, ఎరువుల పంపిణీ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నవీన్, ఏడీఏ రమేష్, ఏఓ దీపిక, సహకార శాఖ ఇన్‌స్పెక్టర్ నిజమోద్దీన్, సీఈవో తిరుపతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఈపాస్ మిషన్ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు



- రేపటి నుంచి శ్రావణ శుభ ముహూర్తాలు
- నవంబరు 29 వరకు వివాహాల కోలాహలం
- పెళ్లికి ముందస్తు పనుల్లో బిజీబిజీ

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివాహాల కోలాహలం ప్రారంభం కానుంది. శ్రావణ మాసం ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం అవుతుంది. శుభ కార్యాలు శుక్రవారం నుంచి మొదలు కానున్నాయని జగిత్యాలకు చెందిన వేద పండితులు అంటున్నారు. నెలన్నర రోజులుగా వేడుకలు పెద్దగా లేకపోవడంతో వివిధ వృత్తుల వారు, వ్యాపారులు ఉపాధికి దూరమయ్యారు. మళ్లీ ముహూర్తాలు మొదలు కానుండడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, కేటరింగ్‌తో పాటు జ్యూవెలరీ, వస్త్ర, కిరాణ తదితర వ్యాపారాలకు గిరాకీ పెరగనుంది. శ్రావణ మాసం ప్రారంభం అవుతుండడంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు జరిపించడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలుకానుంది.

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మూడుముళ్లతో అధిక సంఖ్యలో నవ జంటలు ఒక్కటి కానున్నాయి. ఇందుకు అనుగుణంగా యువతీ యువకుల తల్లిదండ్రులు ముందస్తు పెళ్లి పనుల్లో బిజీబిజీగా ఉంటున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు పలు గ్రామాల్లో అధికసంఖ్యలో వివాహ వేడుకలు జరగనున్నాయి.

ఫంక్షన్ హాళ్లు.. క్యాటరింగ్ ముందస్తు బుకింగ్‌లు..

జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనుండడంతో వివాహ నిర్వాహకులు ముందస్తు పనులపై దృష్టిసారించారు. మూడు నెలల ముహూర్తాల్లో సుమారు వెయ్యికిపైగా వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్, పురోహితులు, భాజా భజంత్రీ లు, ఆర్కేస్ట్రా, డెక రేషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ప్రీ వెడ్డింగ్ షూట్ స్టుడియోలు ఇలా పెళ్లికి అవసర మైన వాటిని ముందస్తుగా బుక్ చేసుకోవడంపై దృష్టి సారించారు. వివాహాలకు అవసరమైన పట్టు వస్త్రాలు, దుస్తులు, బంగారు ఆభరణాలు ముంద స్తు కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో సుమారు 150 వరకు ఫంక్షన్ హాళ్లు, సుమారు 300 వరకు కమ్యూనిటీ హాళ్లు, పదుల సంఖ్యల్లో దేవాలయాల్లో పెళ్లి మండపాలు ఉన్నట్లు అంచనా ఉంది. వీటిని ముందస్తుగా బుక్ చేసుకోవడంపై వివాహాల నిర్వాహకులు దృష్టి సారించారు.

ఊపందుకోనున్న వ్యాపారాలు..

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో పలు వ్యాపారాలు జోరుగా సాగనున్నాయి. షాపింగ్ మాల్స్

మిగతా 8లో



ఇవీ వివాహ ముహూర్తాలు..

వివాహానికి యోగ్యమైన ముహూర్తాలను పండితులు సూచిస్తున్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 26వ తేదీ, 27, 30, 31 తేదీల్లో పలు ముహూర్తాలు ఉన్నట్లు నిపుణులు అంటున్నారు. ఆగస్టు 3, 5, 7, 8, 10, 11, 14, 15, 17, 18వ తేదీల్లో సైతం మంచి ముహూర్తాలున్నాయి. భూమిపూజలు, శంకు స్థాపనలు, గృహ ప్రవేశాల, కేశఖండనాలు, ప్రతిష్ఠాపనల నిర్వాహకులు పురోహితులను సంప్రదించి ముహూర్తాలను నిర్ణయించుకుంటున్నారు. మళ్లీ ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో అంటే...అక్టోబరు 4వ తేదీ, 8, 16, 24, 31, నవంబరు 1వ తేదీ, 7, 22, 23, 25, 26, 29 తేదీల్లో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి వీలుగా ముహూర్తాలున్నాయని వేదపండితులు అంటున్నారు. దీనికి తోడు జిల్లాలో ప్రత్యేక పూజలు, పండగలను భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. నాగ పంచమి, వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమి, వినాయక చవితి పండగలతో ఆలయాల్లో పాటు ప్రధాన వీధులు, గృహాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.

ఇసుక నిలువ కేంద్రం ఏర్పాటు చేయండి

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణ రంగానికి కావాల్సిన ఇసుక స్థానికంగా లభించకపోవడంతో నిర్మాణ రంగం కుంటుపడే పరిస్థితి నెలకొందని, జిల్లా కేంద్రంలో ఇసుక నిల్వ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక, మైన్స్ అండ్ జియోలాజీ మంత్రి వివేక్ వెంకటస్వామికి బుధవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖను రాశారు. పట్టణంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి నిర్మాణదారుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

భూ వివాదం పరిష్కరించాలి

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మల్యాల మండలం ఒగులాపూర్ గ్రామానికి చెందిన సంఘ భూ వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ బీఎస్ లతకు బుధవారం మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా శాఖ అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ వినతిపత్రం అందించారు. గ్రామంలో సంబంధిత భూమి వివాదస్పదంగా ఉండగానే సదరు భూమిలో నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాములు, రాజు, బక్కయ్య, భూమయ్య, వెంకటి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

బీర్‌పూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా కన్వీనర్ బెజ్జారాపు ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని తుంగూర్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షులు రమేష్, లక్ష్మన్, రవి, రమేష్, భూమేష్, ప్రతాప్, హరీష్ పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

6

ఇళ్లపై తెగిపడిన విద్యుత్ తీగలు

- తప్పిన పెను ప్రమాదం

7

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 106 నకిలీ సర్టిఫికెట్లు.. కంప్యూటర్.. ప్రింటర్ స్వాధీనం

6

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



సారంగాపూర్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాలరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బాలపల్లిలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇందిరా మహిళశక్తి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే ఇందిరా మహిళ శక్తి కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీఈ మిలింద్, ఏపీఎం ఓదెల గంగాధర్, మాజీ సర్పంచ్ సుధాకర్, చిర్ర నరేష్, రౌతు గంగాధర్, సీడీపీవో మమత, గుంటి రవి, కడ మహేష్, రవి పాల్గొన్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు..

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని అర్హులైన ప్రతీ ఒక్కరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రేచపల్లి, అర్పపల్లిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే పేద ప్రజలకోసం సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వహిద్దీన్, ఎంపీడీవో గంగాధర్, డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య, ఎంపీవో సలీం, నాయకులు రాజేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

జగిత్యాల అర్బన్: జగిత్యాల పట్టణంలోని 11వ వార్డులో 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని డబుల్ బెడ్ రూం ఇళ్ల మౌలిక వసతుల కల్పనకు 20 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బాలె లత, పడిగెల చంద్రయ్య, నక్క గంగాధర్, పరంకుశం క్రాంతి, రూట్ల రాజేశ్, సుజయ్, బొల్లరపు మహేష్, బాలె శంకర్, గజ్జెల శంకర్ పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు

కలెక్టర్ సత్య ప్రసాద్



పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంపిణీ చేసే ఎరువుల పంపిణీలో అవకతవకలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. మే నెలలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి 35 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు రికార్డులో చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు రైతుల భూమి వివరాలు ఏమీ లేకుండా ఎలా ఇచ్చారని, ఒక రైతుకు అన్ని బస్తాల ఎరువులు ఇస్తే మిగతా రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ విషయమై సంబంధిత పీఏసీఎస్ సీఈవో, ఏఈవోపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి, డెంగ్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను, సాదాబైనామ దరఖాస్తులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన, పట్టా భూములకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. రేషన్‌కార్డు దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 1300 రేషన్‌కార్డులు వచ్చాయని అందులో 293 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గల 972 సర్వేనంబర్ గల భూమిలో 5000 మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు.

- **నీటిని వదలాలని కలెక్టర్‌కు వినతి..**

గోదావరి నదిలోకి ఎస్సారెస్పీ నీటిని వదలాలని గంగనాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులు కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇబ్రహీంపట్నం మండలంతో పాటు మల్లాపూర్ మండలాల రైతులు ఈ ఆయకట్టు నీటి ద్వారానే పంటలు సాగు చేస్తారని రైతులు కలెక్టర్‌కు తెలియజేశారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీఏ రమేష్, తహసీల్దార్ వరప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, డిప్యూటీతహసీల్దార్ ప్రసాద్, ఏవో రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న మంత్రి 'అడ్లూరి'

ధర్మపురి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రంలో రూ 1.27 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులచే చేపట్టిన ఎస్‌కేఎన్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్ (గ్రౌండ్ ఫ్లోర్), నాగమయ్య దేవాలయం పునః ప్రారంభం, పుట్ట బంగారం స్థలంలో నిర్మించిన వేదికను మంత్రి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, పాల్గొంటారని తెలిపారు.

వంట కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కొడిమ్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం డిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని తెంగాణలోని మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. మధ్యాహ్న భోజనానికి బడ్జెట్, రైస్, రాగి జావ, కార్మికుల జీతాలు, విద్యార్థులకు అందించే మెస్ బిల్లుల తమకు వచ్చే విధంగా చూడాలని మంత్రిని కోరినట్లు మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు రజియాసుల్తానా విలేకరులకు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి విద్యా శాఖ మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అంతకు ముందు రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిని కలవటానికి వెళ్లిన మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం నాయకులకు, సభ్యులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘం నాయకులు, సభ్యులు ఉన్నారు.



ఎల్‌ఎండీలో చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి


మృతి చెందిన సయ్యద్ రిజ్వాన్, సర్వర్

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీలో బుధవారం చేపల వేటకువెళ్లి ఇద్దరు మృతిచెందారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సాలే నగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్(55) తన తమ్ముడి కుమారుడైన సయ్యద్ రిజ్వాన్(20)తోపాటు మహమ్మద్ ఇసాక్ (33) మండలంలోని లోయర్‌మానేర్ డ్యాం(ఎల్‌ఎండీ)లో చేపలవేటకు ఉదయం10గంటలకు వెళ్లారు. చేపలుపట్టే సమయంలో సయ్యద్ రిజ్వాన్(20) ప్రమాద వశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన రిజ్వాన్ పెద్దనాన్న సయ్యద్ సర్వర్(55) కాపాడేందుకు పోయి అతడితోపాటు నీటిలో మునిగి పోయాడు. అక్కడే ఉన్న మరోవ్యక్తి ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమా చారం తెలుసుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాం త్‌గౌడ్, నీటిమునిగిన వారి కుటుంబ సభ్యులు వెంటనే సంఘటన స్థలానికిచేరుకొని వలల సహయంతో నీటిలో మునిగినిగిపోయిన ఇద్దరిని వెలికితీశారు. అప్పటికేఇద్దరు మృతిచెందారు. మృతదే హాలను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్ట్

- పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కొనుగోలు చేసిన వారిపై కేసు


దొంగను, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ మొగిలి

తంగళ్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా వరుసగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగలను తంగళ్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో దొంగల అరెస్ట్ చూపిన అనంతరం రూరల్ సీఐ మొగిలి మాట్లడారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఆడెపు రవి కుమార్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్నాడన్నారు. బుధవారం చోరీకి పాల్పడిన ఆడెపు రవికుమార్‌తోపాటు బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరోవ్యక్తి పరారయ్యాడని పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు ఏడు నెలలుగా తంగళ్లపల్లి మండలంతో పాటు, ముస్తాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో పది ద్విచక్ర వాహనాలు చోరీ చేశారని, దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను చందుర్తి, కరీంనగర్, సిరిసిల్లలో తక్కువ ధరకు విక్రయించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసి పది వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దర్యాప్తు వేగవంతంగా చేసి చాకచక్యంగా దొంగలను పట్టుకున్న తంగళ్లపల్లి ఎస్ఐ ఉపేంద్రచారిని, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్, బాలనర్సయ్యలతోపాటు కానిస్టేబుళ్లు కానిస్టేబుళ్లు నరేందర్, రామ్మోహన్, వికాస్‌లను సీఐ అభినందించారు.

నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 106 నకిలీ సర్టిఫికెట్లు.. కంప్యూటర్.. ప్రింటర్ స్వాధీనం

కోరుట్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అదర్శనగర్ ప్రాంతానికి చెందినవ్యక్తి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్టు కోరుట్ల సీఐ సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్లలోని ఆదర్శనగర్‌కు చెందిన రుద్ర వేణుగోపాల్ పట్టణంలోని పోచమ్మ వీధిలో ఆన్‌లైన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఫొటోషాప్‌ద్వారా నకిలీ సర్టిఫికెట్లు, ఎస్సెసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెమోలు, నకిలీడెత్ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీసీఎస్ పోలీసులతో పాటు స్థానికపోలీసులు ఆన్‌లైన్ కేంద్రంపై దాడి చేసినట్లు సీఐ తెలిపారు. ఆన్‌లైన్ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కేంద్రంలో నిల్వఉన్న 106 నకిలీ సర్టిఫికెట్లు(పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డెత్ సర్టిఫికెట్లను) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్, ప్రింటర్, పేపర్ కటింగ్, లామినేషన్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. రుద్ర వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల సీఐ సురేష్ బాబు, కోరుట్ల ఎస్ఐ చిరంజీవి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజు, సీసీఎస్ కానిస్టేబుల్స్‌ను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.



గ్రామీణ మహిళలకు వరం.. నమో డ్రోన్ దీదీ

- డిజిటల్ వ్యవసాయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకం
- మహిళ సంఘాలకు ఉపాధి అవకాశం

చొప్పదండి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యవసాయంలో భాగంగా గ్రామీణ మహిళల ఉపాధి కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని తీసుకువచ్చింది. వ్యవసాయ ఆధారిత ఉపాధేమార్గంగా మహిళలు జీవితాల్లో మార్పు తేవడంతో పాటు ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈపథకాన్ని తీసుకువచ్చింది. మహిళా సాధికారిత, వ్యవసాయంలో ఆధునికత, నైపుణ్య అభివృద్ధితోపాటు గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్రోన్ దీదీ నూతన అవకాశాలను కల్పిస్తున్నది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తుండగా ఆసక్తిఉన్న మహిళా సంఘాలు దరఖాస్తు చేసుకోవాలి.

డ్రోన్ సేవలు..

సబ్సిడీపై అందే డ్రోన్లతో ఎస్‌హెచ్‌సీ గ్రూపులు వ్యవసాయంలో రైతులకు సహాయకారిగా పనిచేస్తాయి. ప్రతియేటా కనీసం లక్ష రూపాయల ఆదాయాన్ని పొందుతాయి. పంట పొలాలపై ఎరువులు, పురుగు మందుల పిచికారితోపాటు పంట సర్వేలు, మ్యాపింగ్, డేటా అనాలసిస్ లాంటి పనులను డ్రోన్‌ద్వారా సంఘాల సభ్యులు నిర్వహిస్తారు. వ్యవసాయాధారిత డ్రోన్‌ద్వారా సంఘాలకు ఆదాయంతోపాటు మహిళల జీవితాల్లో మార్పును తీసుకువస్తాయి. ప్రస్తుతం పంట పొలాలకు ఎరువులు, పురుగుమందుల పిచికారి కోసం రైతులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఎకరానికి 300నుంచి 500రూపాయల వరకు డ్రోన్ ఆపరేటర్లు చార్జి చేస్తున్నారు. డ్రోన్ మహిళా సంఘాలకు ఆదాయం తెచ్చిపెట్టనుంది. స్వయం సహాయక గ్రూపులు నమోడ్రోన్ దీదీ కోసం వ్యవసాయ శాఖ లేదా కృషి విజ్ఞాన కేంద్రాలను సంప్రదించాల్సి ఉంటుంది. లేదా ఠఠఠ్ర్ఃఱజుజీజీజట్చ.ఛీచి.జౌ౯.జీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.

నమో డ్రోన్ దీదీ లాభాలు..



దేశవ్యాప్తంగా 15వేల మహిళాగ్రూపులకు డ్రోన్లను అందించనుంది. ప్రతిడ్రోన్ కొనుగోలుపై కేంద్రప్రభుత్వం 80శాతం సబ్సిడీని అందజేస్తుంది. గరిష్టంగా 8లక్షల వరకు డ్రోన్ కొనుగోలుపై సబ్సిడీ అందుతుంది. మిగతా డబ్బులను అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా 3శాతం వడ్డీపై రుణాన్ని అందజేస్తారు. పథకానికి ఎంపికైన సంఘ సభ్యులకు డ్రోన్ నడిపేందుకు సరైన శిక్షణ అందిస్తారు. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో డ్రోన్‌ను సంఘాలకు అందజేస్తారు. డ్రోన్ శిక్షణ కోర్సును డీజీసీఏ అంగీకరిస్తుంది. రైతులకు డ్రోన్‌ద్వారా సేవలందిం చేందుకు వ్యవసాయశాఖ మహిళాసంఘాలకు మద్దతునిస్తోంది. ఎంపవర్డ్, నాఫెడ్, ఇఫ్కోతోపాటు కస్టమ్ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీ)ల భాగస్వామ్యంతో పనిచేస్తాయి. డ్రోన్ తయారీదారులు, శిక్షణసంస్థలు, వ్యవసాయశాఖ కూడా సంఘాలకు సహకారాన్ని అందిస్తాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి ● మరో నలుగురికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామంలోని టోల్‌గేట్ సమీపంలో రోడ్డుకు పక్కన ఆగిఉన్న లారీని వెనకనుంచి కారుఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందగా, కారుడ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన లంగరు లోకేష్ తన మిత్రుడైన మన్నె రాఘవ(22)ను తీసుకొని హైదరాబాద్‌లో ఒకారును అద్దెకు తీసుకొన్నారు. అతనికి పరిచయస్తురాలైన స్నేహ, ఆమెతోపాటు ఆమె తల్లి దండ్రులైన రాజేష్,లక్ష్మితో కలిసి కరీంనగర్‌లోని గంగాధరకు బయలుదేరారు. లోకేష్ కారు నడుపుతుండగా అతని పక్క సీట్లో రాఘవ కూర్చున్నాడు. వారు ప్రయాణిస్తున్న కారు తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని టోల్ గేట్ సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చున్న మన్నె రాఘవతోపాటు వెనకాల కూర్చొన్న మొర్కురి స్నేహ, మొర్కురి రాజేష్, మొర్కురి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎల్‌ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అక్కడే ఉన్న టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్లు పరీక్షించి మన్నె రాఘవ మృతి చెందినట్లు తెలిపారు. మిగతా వారిలో మొర్కురి స్నేహ, రాజేష్, లక్ష్మి తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, డ్రైవర్ లోకేష్‌కు స్వల్ప గాయలయ్యాయి. మృతిచెందిన మన్నే రాఘవ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ లోకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

కువైట్‌లో గుండెపోటుతో ఖాసింపేట వాసి మృతి


సాగర్(ఫైల్)

గన్నేరువరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట గ్రామానికిచెందిన బత్తుల సాగర్(42) బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్ళి అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. మూడేళ్లక్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ రెండు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. మళ్లీ ఇటీవలే కువైట్‌కు తిరిగి వెళ్లాడు. శనివారం అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు సాగర్ స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. మృతుడికి భార్య సరవ్వ, కూతురు ఉండగా కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహం కోసం కుటుంబసభ్యులు, బంధువులు ఎదురుచూస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ కమాన్ వద్ద రోడ్డుపై పడిఉన్న వ్యక్తిని 108 అంబులెన్స్ సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా అదే రోజు అర్ధరాత్రి 11 గంటలకు మృతి చెందాడు. మృతుడు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేముందు తనపేరు అక్తర్ మహ్మద్ పాషా, బృందావన్‌కాలనీగా చెప్పినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలు తెలియరావడంలేదని, గుర్తించిన వారువెంటనే ప్రభుత్వాస్పత్రిలోని అవుట్ పోస్ట్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

- మరో ఐదుగురికి జరిమానా

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఆరుగురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు తెలిపారు. మద్యం సేవించి 2వసారి పట్టుబడిన ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష, మరోఐదుగురికి రూ.10వేలజరిమానా విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్కల దాడిలో లేగ దూడ్‌పై మృతిచెందగా, మరో దూడ గాయపడింది. ఈ సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కటకం మల్లికార్జున్, కటకం వేణు అనే రైతులకు చెందిన లేగ దూడలపై పిచ్చి కుక్కలు బుధవారం తెల్లవారుజామున దాడి చేయడంతో ఓ లేగ దూడ మృతి చెందగా, మరో లెగదూడ తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతోంది. దూడ మృతి చెందడంతో రైతుకు సుమారు రూ.16వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గ్రామంలో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామశివారులో పేకాటఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్టు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. నాగంపేట గ్రామ సమీపాన పేకాట ఆడుతున్నట్టు ఆడిన సమాచారం మేరకు గాలించగా ముగ్గురు పేకాట ఆడుతూ కనిపించారని పేర్కొన్నారు. వారిని పట్టుకొని, వారి నుంచి రూ.11,500, 3బైకులు, 2 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కోనరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి జరిమానా విధించారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికిచెందిన చకినాల నర్సవ్వ గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ మళ్లీ నాటుసారా విక్రయిస్తూ బైండవర్ నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఆమెను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.25వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలరాంపూర్ గ్రామానికి చెందిన గూడ రవి హత్య కేసులో నిందితుడైన గూడ గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల9న భూ తగాదాలో గంగాధర్‌వరసకు సోదరుడైన రవిని పారతో విచక్షణారహితంగా కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. రవిని మెరుగైనచికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించారు. రవి భార్య రజిత ఫిర్యాదు మేరకు అత్యాయత్నం కేసు నమోదు చేశారు. గూడ రవి చికిత్సపొందుతూ ఈనెల 21న మరణించాడు. దీంతో రవిపై మెటపల్లి సీఐ అనిల్‌కుమార్ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తుచేశారు. నిందితుడుగూడ గంగాధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

ముత్తారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కాల్వశ్రీరాంపూర్‌మండలం ఇదిలాపూర్ గ్రామానికి చెందిన సదానందం అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గోదావరిఖని ఇన్‌చార్జి ఏసీపీ మల్లా రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ

- బంగారు అభరణాలు, వెండి, నగదు అపహరణ



పోరండ్లలో విచారిస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లి సంఘటన మండలంలోని పోరండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోరండ్ల గ్రామంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగింది. చందనం సుగుణ తన భర్త గతనెల క్రితం మరణించగా ఇల్లు వదిలిపెట్టి పోరండ్ల గ్రామంలోనే మరోఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతిరోజు తన సొంత ఇంటికి వస్తూ పోతూ ఉన్నారు. రోజూ లాగే బుధవారం కూడా ఇంటికి వెళ్లిన సుగుణ కుమారుడికి ఇంటితాళాలు పగల గొట్టి ఉండటం గమనించాడు. వెంటనే తల్లికి సమాచారం అందించగా లోనికి వెళ్లి చూడటంతో ఇంట్లో ఉన్న బీరువాలో వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువలో దాచిఉంచిన మూడుతులాల బంగారం, 20 తులాల వెండి, కొంతనగదు కనబడలేదు. అదేవిధంగా గ్రామంలోనే మామిడిపల్లితిరుపతి ఇంట్లో కూడా ఎవ్వరూలేని సమయంలో తాళాలు పగలగొట్టి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పక్కనేఉన్న మామిడిపల్లి అంజవ్వ ఇంటితాళాలు పగల గొట్టి రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, క్లూస్‌టీం పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రేకులపల్లిలో చోరీ..

బీర్‌పూర్: మండలంలోని రేకుపల్లి గ్రామానికి చెందిన సూరారపు గంగయ్య అనే వృద్ధుడి ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్య ఇంట్లో తెల్లవారుజామున మూడుగంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుకాల ఉన్న తలుపులను పగులగొట్టి ఇంట్లో ప్రవేశించారు. గంగయ్యభార్య మెడలోని ఆభరణాలు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా గంగయ్య ప్రతిఘటించడంతో దొంగలు వారు తెచ్చుకున్న పదునైన ఆయుధాలతో గంగయ్య తొడపై గాయపర్చారు. గంగయ్య భార్య దగ్గర ఉన్న తులం కుత్తికట్టు, ఒక గ్రాము ముక్కుపుడక, 40తులాల వెండికడియాలు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని ఇంటి వెనకాల నుంచి పారిపోయారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు నల్లని దుస్తులు ధరించి బూట్లువేసుకొనిఉన్నారని గంగయ్య తెలిపాడు. సంఘటన వివరాలు తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజు పోలీసు సిబ్బందితో పోలీస్ డాగ్‌స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

బండి సంజయ్‌పై పోస్టుపెట్టిన బీఆర్‌ఎస్ నాయకుడి విచారణ

- 35(3) బీఎన్‌ఎస్ కింద నోటీసు
- వేధింపులకు గురి చేస్తున్నారన్న హరీష్‌రెడ్డి

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కుటుంబ సభ్యులపై ట్విట్టర్‌లో దూషిస్తూ పోస్టుపెట్టిన కేసులో రామగుండం బీఆర్‌ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డికి బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 35(3) బీఎన్‌ఎస్ కింద నోటీసు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. బండి సంజయ్‌ని ఉద్దేశించి ముఖ్యమంత్రి, బండి సంజయ్ ఇద్దరు ఉన్న ఫొటోను పోస్టు చేస్తూ కించపరిచే విధంగా పోస్టు పెట్టారని గోదావరిఖనికి చెందిన బీజేపీ నాయకుడు కోమళ్ల మహేష్ 2024అక్టోబర్ 24న గోదావరిఖని ఏసీపీకి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు బుధవారం నోటీసు జారీచేశారు. ఈసందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులపై కక్షపూరితంగా కేసులు నమోదు చేస్తున్నారని, సోషల్ మీడియా కేసులు నిలువవని తెలిసి కూడా భయబ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తనపై ఇప్పటికే 10 కేసులు పెట్టారన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దోపిడీకి పాల్పడిన ఎనిమిదిమంది సభ్యులు గల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద తులం పావు బంగారం, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది స్మార్ట్ ఫోన్లు, లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి పాల్పడిన జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తరాల శ్రీకాంత్ అలియాస్ బండి శ్రీకాంత్, చెట్ల మహేశ్, జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన పాలకుర్తిరాజు, విద్యానగర్ కాలనీకి చెందిన ఉల్లెంగుల సతీష్, పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన బడుసు మురళీ, సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఏలేటి మోహన్ రెడ్డి, రేచపల్లి గ్రామానికి చెందిన అన్నారపు రఘు, బండి మధును పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికిచెందిన ఇందూరి శంకరయ్య ఈనెల22వ తేదీన మధ్యాహ్నం గ్రామంనుంచి జగిత్యాలకు సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని హనుమాన్ వాడలో గల బీరయ్యగుడి వద్దకు రాగానే అకస్మాత్తుగా బండి శ్రీకాంత్, పాలకుర్తి రాజు, చెట్ల మల్లేశం అను ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. శంకరయ్యను సమీపంలోని పాలకుర్తి రాజు ఇంట్లోకి బలవంతంగా లాక్కొని వెళ్లి, కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న తులం పావు బంగారం దోపిడీ చేశారు. బండి శ్రీకాంత్ అను వ్యక్తి భయబ్రాంతులకు గురిచేసి శంకరయ్య ఫోన్ ద్వారా ఒకలక్ష రూపాయలు ఫోన్‌పే చేయించుకున్నాడు. తర్వాత బండి శ్రీకాంత్, చెట్ల మల్లేశం సమాచారం ఇవ్వడంతో మరో ఇద్దరు వ్యక్తులు ఉల్లెంగుల సతీష్, బడుసు మురళి కలిసి టీఎస్02ఈక్యూ 3666 నంబరుగల కారులో బలవంతంగా శంకరయ్యను సారంగాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కొట్టారు. శంకరయ్యను ఇంకా డబ్బులు కావాలని.. ఇవ్వకుంటే చంపుతామని కత్తితో బెదిరించారు. తరువాత బండి శ్రీకాంత్ సెల్‌ఫోన్ ద్వారా ఏలేటి మోహన్‌రెడ్డి అనేవ్యక్తికి సమాచారం అందించి అక్కడికి పిలిపించాడు. జరిగిన విషయం చెప్పి వచ్చిన డబ్బులు అందరం పంచుకుందామని తెలిపాడు. ఏలేటి మోహన్ రెడ్డి అనే వ్యక్తి అన్నారపు రఘు, బండి మధును పిలిచి విషయం చెప్పగా వారు కూడా ఒప్పుకుని తర్వాత టీఎస్18హెచ్1246 నంబరుగల ఒక ద్విచక్రవాహనంపై కల్లెడ గ్రామంలోని ఇంటికి శంకరయ్యను తీసుకెళ్లారు. ఇంకా డబ్బు, బంగారం కావాలని శంకరయ్యను బెదిరించారు. దీంతో శంకరయ్య భయానికి గురయి ఇంట్లో తన తల్లి మీద గల బంగారు పుస్తెలతాడు తీసుకుని నిందితులకు ఇవ్వడానికి ప్రయత్నించాడు. కాగా సదరు బంగారు పుస్తెల తాడును తీసుకోకుండా, అది అమ్మి డబ్బులు తేవాలని బెదిరింపులకు గురిచేశారు. కల్లెడ గ్రామం నుంచి జగిత్యాలకు నిందితులు శంకరయ్యను ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని తీసుకొని వచ్చారు. పట్టణంలోని క్లాక్‌టవర్ దగ్గర గల బాలాజీ జువేల్లర్స్ దుకాణంలో బంగారు పుస్తెల తాడును విక్రయించి డబ్బులు తీసుకుంటుండగా శంకరయ్యకు బావ అయిన తుమ్మనపల్లి రమేష్ అక్కడకు అకస్మాత్తుగా వచ్చి అడ్డుకున్నాడు. వెంటనే బావ తుమ్మనపల్లి రమేష్ సహకారంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శంకరయ్య ఫిర్యాదు చేశారు. జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 23వ తేదీన సంఘటనలో నిందితులైన ఎనిమిది మంది జగిత్యాల పట్టణంలో టీఎస్ 21 ఎఫ్ 0252 నంబరు గల కారులో కూర్చుని దోపిడీచేసిన డబ్బులు పంచుకుందామని మాట్లాడుకుంటుండగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. దోపిడీదొంగల ముఠాను పట్టుకోవ డంలో కృషిచేసిన డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, రూరల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, రూరల్ ఎస్ఐ సధాకర్, ఎస్ఐ కుమారస్వామి, మహిళా ఎస్ఐ సుప్రియ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి రివార్డును అందజేశారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన



దీపాలు వెలిగిస్తున్న ఈవో, భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాలింగార్చనను అర్చకులు ఘనం గా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్క రించుకుని అర్చకులు ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రా భిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ అద్దాల మంటపంలో అర్చకుల వేదమంత్రాల మధ్య మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఈవో రాధాబాయితోపాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

బడి బ్యాగులు భారం కావొద్దు

● గట్టుబూత్కూర్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి

గంగాధర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బడి బ్యాగులు భారం కావొద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండలం గట్టుబూత్కూర్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు పది కిలోలు ఉండటంతో ఎంఈవో ప్రభాకర్‌రావు ప్రత్యేక చొరవ చూపి మూడు కిలోలు ఉండేలా అందించడం అభినందనీయమన్నారు. ఈవిషయం తెలుసుకుని పాఠశాలలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. బడి బ్యాగు బరువు తగ్గించడంతో ఈ విషయాన్ని రాష్ట్ర ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్‌తో ఫోన్‌లో మాట్లాడి గంగాధర ఎంఈవో ప్రభాకర్ రావు పనితీరును వివరించారు. గంగాధర మండలం గట్టుబూత్కు ర్‌లో అనుసరిస్తున్న మూడుకిలోల విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబ్యాగు మూడుకిలోలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్న ఎంఈవో ప్రభాకర్‌రావును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



బ్యాగు బరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సబ్బితం జలపాతం అభివృద్ధికి రూ.6 కోట్లు

● పర్యాటక ప్రాంతంగా మారనున్న గట్టు సింగారం



సబ్బితం జలపాతం(ఫైల్)

పెద్దపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చిన్న పాటి చినుకులకే గట్టు సింగారం జలపాతం జల ధారలతో సవ్వడి చేస్తుంది. జాలువారే జలపాత ధారల కింద తడిసి ముద్దవ్వాలని ఎవరికైనా అనిపిస్తుంది. ఈ జలపాతం పర్యాటకులను వర్షాకాలంలోనే కనువిందు చేస్తుంటుంది. జిల్లా వాసులే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి ఇక్కడికి పర్యాటకులు ప్రతి ఏటా వస్తుంటారు. ఇక్కడ సరైన వసతులు లేక, రక్షణ చర్యలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన గెలుపొందిన తర్వాత అధికారులతో కలిసి జలపాతాన్ని సందర్శించారు. ఆ మేరకు సంబంధిత అధికారులు 12 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రతిపాదనలు ఎమ్మెల్యే ప్రభుత్వానికి సమర్పించారు. ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ టూరిజం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ఎందరో ప్రజా ప్రతినిధులు సబ్బితం జలపాతాన్ని సందర్శించి దానిని అభివృద్ధి చేస్తామని చెప్పినా నెరవేర్చలేదన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్ద పీఠ వేస్తుందని తెలిపారు. సబ్బితం జలపాతం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు స్టీల్ బ్యాంకులు

● ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు
● రూ. 2.54 కోట్లతో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ సామగ్రి పంపిణీ
● గ్రామైక్య సంఘాలకు లబ్ధి



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్టీల్ బ్యాంకులు

సైదాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు స్టీల్‌బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2.54 కోట్ల రూపాయల వ్యయంతో స్టీల్ సామగ్రిని మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్నారు. ఈనెల 17న హుస్నాబాద్ నియోజక వర్గంలోని కోహెడ మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతల మీదుగా స్టీల్ బ్యాంకుల కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. 19న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి సైదాపూర్ మండలంలోని ఆరు గ్రామైక్య సంఘాలకు స్టీల్ బ్యాంకులను అందజేశారు. మిగత సంఘాలకు త్వరలోనే అందజేస్తామన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామైక్య సంఘాలకు వీటిని అప్పగిస్తున్నారు.

● **మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు**

స్టీల్ బ్యాంక్‌ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పచెబుతున్నారు. వారు నామమాత్రం రుసుముతో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించే వారికి సామగ్రి అందించనున్నారు. ప్రతీ గ్రామైక్య సంఘానికి ఒక స్టీల్ బ్యాంకు మంత్రి పంపిణీ చేస్తున్నారు. స్టీల్ బ్యాంకులో టిఫిన్ లంచ్ ప్లేట్లు, బౌల్స్, వాటర్, టీ గ్లాసులు, డిష్‌లు, బకెట్లు, చేసిన్లు, జ గ్గలు, చెంచాలతో పాటు వంట సామాగ్రి గిన్నెలు ఉంటాయి. ఫంక్షన్‌కు ఉపయోగపడే అన్ని వస్తువులును ఈ స్టీల్ బ్యాంకులో ఉంచారు. స్టీల్ బ్యాంకుల పంపిణీతో సైదాపూర్ మండలంలో 35 గ్రామైక్య సంఘాలకు లబ్ధి చేకూర నుంది. ఈ స్టీల్ బ్యాంకులు కిరాయికి ఇచ్చి ఆ వచ్చిన ఆదాయంతో సంఘాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.



సైదాపూర్‌లో మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

● **హోటళ్లకు స్టీల్ గ్లాసుల అందజేత**

ఇప్పటికే మంత్రి నియోజక వర్గంలో హోటల్ యజమానులకు స్టీల్ టీ గ్లాసులను పంపిణీ చేశారు. ఇక నుంచి హోటళ్లలో పేపర్ గ్లాసులు గాని, ప్లాస్టిక్ గ్లాసులు గానీ వడవద్దని, స్టీల్ గ్లాసుల్లో టీ ఇవ్వాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతున్నారు.

ఆలయాల్లో శ్రావణమాసం ఉత్సవాలు నిర్వహించాలి

● సహాయ కమిషనర్ నాయిని సుప్రియ

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ఆలయాల్లో శ్రావణమాసోత్సవాలు నిర్వహించాలని దేవాదాయ శాఖ సహాయకమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. అస్సెస్సబుల్, డీడీఎన్ ఆలయాల నిర్వహణ సమయం కంటే అరగంట ముందే తెరవాలని సూచించారు. ప్రత్యేక రోజుల్లో ఆలయాల స్థితిని బట్టి ప్రసాద వితరణ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా పెద్దపల్లి జగిత్యాల జిల్లాలకు ఇచ్చిన లక్ష్యం పూర్తయ్యిందని, కరీంనగర్‌లో కొన్ని ఆలయాల్లో మొక్కలు నాటామని పేర్కొన్నారు. మిగతా ఆలయాల్లో మొక్కలు నాటేందుకు ఆర్థిక స్తోమత, సిబ్బంది లేనందున మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు మొక్కలు నాటే విషయంలో లేఖలు రాశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యాపారిని బెదిరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని వ్యాపారులకు ఫోన్లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. లక్ష్మీనగర్‌లో పని చేసే ఒక హమాలీ కార్మికుడు ఫోన్లు చేసి రూ.10 లక్షలు ఇవ్వాలంటూ బెదిరిం చినట్టు పోలీసులు గుర్తించారు. అతన్ని విచారించినట్టు తెలుస్తోంది.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

రుద్రంగి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపైన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలకేంద్రానికి చెందిన సిర్రం వెంకటి (50) మంగళవారం జగిత్యాల జిల్లాలోని తమ బంధువుల ఇంటికి ఓ యువకుడితో కలిసి బైక్‌పైవెళ్లి తిరిగి రాత్రి రుద్రంగికి వచ్చారు. అయితే బుధవారం ఉదయం రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని నందివాగు వద్ద వెంకటి మృతదేహంపడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంకటిమృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో సీఐ వేంకటేశ్వర్లు వారితో మాట్లాడిసర్ది చెప్పడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య కొమురవ్వ, ఇద్దరు కూమారులు, కూతురు ఉన్నారు.

ఇళ్లపై తెగిపడిన విద్యుత్ తీగలు

● తప్పిన పెను ప్రమాదం

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్రావుపేటలో బుధవారం భారీవర్షానికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగిఇళ్లపైపడ్డాయి. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో కాలనీవాసులతోపాటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఎడతెరిపి వర్షం ధాటికి ఎల్టీ విద్యుత్‌తీగలు తెగి ఇళ్లపైపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై ఇళ్లలోంచి బయటికి పరుగులుతీసి ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారంఅందించారు. సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్‌సరఫరాను నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ట్రాన్స్‌కోసిబ్బంది విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు. ఇళ్ల పైనుంచి ఎల్టీవిద్యుత్ తీగలతో ప్రమాదం పొంచిఉందని, లైన్‌ను తొలగించాలని గ్రామస్థులు కోరారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.1.10కోట్లు



డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,10,03,402నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 53 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 61 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్‌చేసి హుండీలలోనే వేసినట్లు తెలిపారు. స్థానాచార్యులు కపీందర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్, అధికారులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు. హుండీ కౌంటింగ్ పర్యవేక్షణకు ఏసీ కార్యాలయం నుంచి రాజమోగిలి హాజరయ్యారు.

● **తలనీలాల టెండర్ రద్దు..**

కొండగట్టులో గురువారం నిర్వహించ తలపెట్టిన తలనీలాల టెండర్ రద్దు చేసినట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సేకరించి నిల్వ చేసిన తలనీలాలకు దేవస్థానం అధికారులు ఈ నెల 18న టెండర్లకు ఏర్పాట్లు చేయగా 13 కాంట్రాక్ట్ సంస్థలు హాజరయ్యాయి. అయితే అధికారులు 24కు వాయిదా వేశారు. తాజాగా గురువారం నాటి టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్ ప్రకటన జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

● **అంజన్నను దర్శించుకున్న విప్ ఆది శ్రీనివాస్**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సతీసమేతంగా బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన విప్‌కు దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విప్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఆలయ అధికారులు, నాయకులు విప్ వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జగిత్యాల విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాదం మహేందర్, గువ్వ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 26, 27వతేదీల్లో షేక్‌పేట్ మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. జిల్లాకు చెందిన దుగ్యాల రాఘవ్‌రావు, పాదం హర్షిత్‌పటేల్, స్వరాలి, మోక్షిత, విద్యాధిప్, సాయి, అక్షయ్ వర్ధన్, రిశ్వంత్, శశాంక్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు సాగర్, అరుణ్, మహిపాల్, నరేష్, కోచ్‌లు వంశీ కృష్ణ, నవీన్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విశాల్

ధర్మపురి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) విద్యార్థి ముస్కువిశాల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విశాల్ తెలంగాణ అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో 16సంవత్స రాల విభాగంలో 600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించాడు. ఆగస్టు3న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి విశాల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థి విశాలుకు హెచ్ఎం శ్రీనివాస్ స్పైక్ షూ అందించారు.

ఎమర్జెన్సీ పోరాటయోధులకు త్వరలోనే తీపి కబురు

● భారత్ సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే తీపికబురు అందించనుందని భారత సురక్షాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్ తెలిపారు. భారత్ సురక్షా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన సత్యాగ్రహులను స్వాతంత్ర్య సమరయోధులుగా కేంద్రప్రభుత్వం త్వరలో పెన్షన్ విధానం అమలుచేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు భారత ప్రభుత్వం కేబినెట్‌లో తీర్మానం చేసిందని, త్వరలోనే స్వాతంత్ర్య సమరయోధులను ఏ విధంగా గుర్తిస్తున్నారో అదే విధంగా ఎమర్జెన్సీ యోధులను కూడా గుర్తిస్తారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు అశోక్ రెడ్డి, సత్యప్రకాష్, దర్శన్, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్‌తో పాటు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాసంఘ బాధ్యులు రాష్ట్ర నాయకత్వాన్ని ఘనంగా సన్మానించారు.

ఆధ్యాత్మిక భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు

● 10జిల్లాలకు చెందిన 1000మంది కళాకారులు.. 10 గంటల ప్రదర్శన



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతితో బుధవారం ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, కళారవళి సోషియోకల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భజన ప్రదర్శనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 1000 మంది కళాకారులు 10 గంటలపాటు నిర్విరామంగా భజన చేసి రికార్డు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రతినిధి బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ వేణుకుమార్ రికార్డులో పేరు నమోదైనట్లు ప్రకటించి ధృవ పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కళాకారులకు రికార్డు ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్ ఫౌండర్ సల్వాజి ప్రవీణ్, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాసు గోపాల్ రావు, రఘుకుల తిలక పాట సృష్టికర్త కొండల స్వామి, బోగ శ్రీనివాస్, రవీందర్, జీఎల్ నామ్‌దేవ్, ఏపీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.76 లక్షల విలువైన గుట్కా పట్టివేత

● 13.17 లక్షల నగదు సీజ్
● పోలీసుల అదుపులో 11 మంది



పోలీసులు సీజ్ చేసిన గుట్కాలోడ్ వ్యాన్

కరీంనగర్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఒక ముఠా కరీంనగర్, గోదావరిఖని ప్రాంతాలకు మహారాష్ట్రలోని బీదర్ నుంచి నిషేధిత గుట్కాను తరలిస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా స్థానికంగా వ్యాపారులకు సరఫరా చేస్తోంది. దీనిపై నిఘాపెట్టిన కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు రూ.76లక్షల విలువైనగుట్కాతోపాటు 11మందిని పకడ్బందీగా పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ బిల్లకోటేశ్వర్ వివరాల ప్రకారం.. కరీంనగర్ తీగల వంతెనవద్ద పోలీసులు బుధవారం ఉదయం గూడ్స్‌వ్యాన్, మినీ ట్రక్‌లను సోదాచేశారు. మహారాష్ట్రలోని బీదర్ నుంచి కరీంనగర్‌కు రవాణా అవుతున్న నిషేధిత గుట్కాను, ముఠాను పట్టుకున్నారు. ముఠాకు చెందిన వారిలో గోదావరిఖనికి చెందిన నలుగురు, కరీంనగర్‌కు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈకేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రెండు వాహనాలతోపాటు 304 బ్యాగ్‌లలో ఉన్న 7,60,000 గుట్కా పాకెట్లను సీజ్ చేశారు. నిందితుల వద్ద నుంచి 13,17,850 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. 13 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్వగ్రామానికి చేరుకున్న రమేష్ మృతదేహం

కోరుట్ల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన రమేష్ (43) మృతదేహం బుధవారం స్వగామానికి చేరుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...ఉపాధి నిమిత్తం రమేష్ 15 సంవత్సరాల నుంచి గల్ఫ్ దేశం బేహరాన్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రమేష్ కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులతో ఫోన్ ద్వారా చెబుతుండేవాడు. ఈ నెల 17వ తేదీన రమేష్ తాను పనిచేస్తున్న క్యాంపు వద్ద రూంలో ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడి స్నేహితుల సహకారంతో రమేష్ మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. భార్య మేఘన, ఇద్దరు కుమారులు రతేష్, చరణ్ ఉన్నారు.

పామాయిల్ పంట లాభదాయకం

మల్లాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లాభదాయకమైన పామాయిల్ పంటను రైతులు సాగు చేయాలని హార్టీకల్చర్ జిల్లా అధికారి శ్యామ్‌ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని మొగిలిపేటలోని రైతువేదికలో రైతుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల అర్బన్, జూలై (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ జగిత్యాల డిపో వారి ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రెండు వందల కోట్ల ఉచిత ప్రయాణాలు చేసిన మహిళలు 6,680 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మహిళామణులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేసి ఉత్తమ ప్రయాణికును సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, దాసరి లావణ్య, ప్రవీణ్, చెటిపెల్లి సుధాకర్, వేణు, శరత్ రావు, పోతునుక మహేష్, రంగు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిటౌన్: ఆర్టీసీలో ప్రయాణం చేయడం ఎంతో సురక్షితమని మెట్‌పల్లి డీఎస్పీ ఎ రాములు అన్నారు. మెట్‌పల్లి డిఎం దేవరాజ్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.



జగిత్యాలలో మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ధర్మపురిలో..

మెట్‌పల్లి డీఎస్పీ రాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పథకం గురించి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళ సంఘం నాయకులు, సిబ్బంది ప్రమీల, చంద్రయ్య, ముజిబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఉచిత బస్ ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల బస్ డిపో మేనేజర్ కల్పన కోరారు. ధర్మపురి బస్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జగిత్యాల డిపో ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం మహిళా ప్రయాణికులను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహలక్ష్మి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం ఇచ్చిందని కోరుట్ల ఆర్డీవో జీవకర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో మహలక్ష్మి పథకం విజయోత్సవ సభ డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఆర్‌డీఓ జీవకర్ రెడ్డి పాల్గొన్నారు. ఉచిత బస్సు సౌకర్యంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు

(5వ పేజీ తరువాయి)

బట్టల దుకాణాలు, జ్యూవెల్లరీ దుకాణాలు, లేడిస్ ఎంపోరియంలు, ఫొటో స్టుడియోలు, వీడియోగ్రఫీ సెంటర్లు, ప్రీ వెడ్డింగ్ షూట్ స్టూడియోలు, ఫంక్షన్ హాల్స్, క్యాటరింగ్ కేంద్రాలు, ఫ్లవర్ డెకరేటర్స్, వంట మాస్టర్స్ ఇలా పలు వ్యాపారాలు పుంజుకోనున్నాయి. ఇప్పటికే ఇందుకు అవసర మైన ఏర్పాట్లను వ్యాపారాల నిర్వాహకులు చేసుకున్నారు. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో బంగారం, వస్త్రవ్యాపారం ఎక్కువగా ఉంటుంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలను వ్యాపారులు తీసుకువచ్చి దుకాణాల్లో విక్ర యానికి సిద్ధంగా ఉంచారు. వినియోగదారులను ఆకర్షించడానికి డిస్కౌంట్‌లు, ఇతర బహుమతులను అందించడానికి ప్రయత్నిస్తున్నారు. వివాహాల సీజన్‌లో జిల్లా మొత్తంగా రోజుకు కోటి రూపాయల నుంచి మూడు కోట్ల రూపాయల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

సూరమ్మ కుడి, ఎడమ కాలువల భూసేకరణకు రూ. 10 కోట్లు మంజూరు

కథలాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం భూసేకరణ నిమిత్తం 10 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల కలెక్టర్ ఖాతాలో డబ్బులు జమ చేయబడ్డాయన్నారు. మూడు మాసాల కిందట రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధుల మంజూరుకు హామీ ఇచ్చిన క్రమంలో నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉంటూ వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.

కాంగ్రెస్ బలోపేతానికి మీనాక్షి నటరాజన్ కృషి



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ మరింత బలోపేతానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ విశేష కృషి చేస్తున్నారని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరాభవన్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలను మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, నాయకులు గాజుల రాజేందర్, కొత్త మోహన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు

- ధర్మపురిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. క్షేత్రంలో లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలు, పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి.

- మంగళవారం గణ నాథుడిని పూజించి, ఇంటిలో సకల సౌభాగ్యం, సంపద కోసం గౌరీ వ్రతాలు ఆచరిస్తారు.
- బుధవారం కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లికి పిల్ల పాపలతో కలిసి వచ్చి గోదావరి నది వద్ద తెప్పె మొక్కులు చెల్లించుకుంటారు.
- గురువారం సాయినాథునికి క్షీరాభిషేకం జరిపి ఉపవాస దీక్షలు చేపడుతారు.
- శుక్రవారం నదీ తీరాన గల సంతోషీ మాత దేవాలయంలో దంపతులు తమ కుటుంబ సౌభాగ్యం కోసం ఉద్యాపన పూజలు, శుక్రవార వ్రతాలు, మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తారు. వేంకటేశ్వర స్వామి యాగశాల వద్ద లక్ష్మి హవనంలో పాల్గొని పూజలు నిర్వహిస్తారు.



- శనివారం రోజున లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో స్వామి వారలకు అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపి సకల పీడలు, దోష నివారణ కోసం యాగశాల వద్ద నరసింహ హోమం నిర్వహిస్తారు. క్షేత్రానికి స్వామి వారల దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, ధర్మకర్తలు ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

● లక్ష్మీనరసింహుని ఆలయంలో పూజలు

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన దేవాలయంలో స్వామి వారికి నెల రోజుల పాటు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. భక్తులు 2,516 రూపాయలు చెల్లిస్తే వారి పేరట నెలరోజుల పాటు అభిషేకం, పూజలు, సంకల్పం నిర్వహిస్తారు.

ఉగ్ర నారసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక భోగములు జరిపి 2000 రూపాయలు చెల్లిస్తే భక్తుల పేరట నెల రోజుల పాటు అభిషేకం, భోగములు, సంకల్పం నిర్వహిస్తారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు 1000 రూపాయలు చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం, అన్నపూజ నిర్వహిస్తారు. ఉగ్ర నారసింహుని ఆలయంలో రాత్రి ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాల కారణంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే తప్ప బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. చేపలు పట్టుటకు, పశువులను మేపడానికి బయటకి వెళ్లవద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని, అత్యవసర సమయంలో సహాయం కోసం డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

సారంగాపూర్‌లో భారీ వర్షం

సారంగాపూర్, జూలై, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. 79.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. రాత్రి కురిన భారీ వర్షంతో రైతుల పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో రైతులు ట్రాక్టర్లతో పొలం దున్నుతున్నారు. కుంటల్లోకి, చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించాలి

మెట్‌పల్లిటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ సూచించారు. బుధవారం పట్టణంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ గంగారాం, సిబ్బంది ఉన్నారు.

గంగనాల ఆయకట్టుకు నీటిని విడుదల చేయించాలి

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంగనాల అయకట్టుకు సాగునీరు విడుదల చేయించాలని కోరుతు కలెక్టర్ సత్యప్రసాద్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు మండలంలోని వేములకుర్తి గ్రామరైతు నాయకులు రాధరపు దేవదాస్, అరె రమేష్ బుధవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములరాంపూర్ నిర్మల్ జిల్లా పోన్‌కల్ గ్రామశివారులో సదరుమాటు బ్యారేజీ నిర్మాణంతో గంగనాల మాటు కాలువకు వచ్చే పాయలో రాళ్లు చదును చేయకపోవడంతో అయకట్టు కింద పొలాలకు నీరు అందటం కష్టంగా మారిందన్నారు. గోదావరిలోకి నీరు వదిలితే పంటల సాగుకు సులభమవుతుందని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి

జగిత్యాలరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణీలు ప్రసవాలు చేయించుకోవాలని జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీ చేయించుకుంటే డబ్బులు వృథా కావడంతో పాటు సాధారణ ప్రసవాలను పొందే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

మెట్‌పల్లిటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కారించాలని ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చేపట్టిన మూడు దశల పోరాటంలో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు భోజన విరామ సమయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెయింటింగ్ బిల్లులతో సహా బదిలీలు, పదోన్నతులు తదితర సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తిరుకోవెల శ్యామ్ సుందర్, రామేశ్వర్, వహిద్, చిన్న అంజయ్య, యాదగిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పక్షాన పాఠశాల విద్యాలయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రమేష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి లావుడ్య రాజయ్య, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు బబ్బురి రాజేందర్ పాల్గొన్నారు.

కథలాపూర్: ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు.డీటీఎఫ్, టీఎస్ యుటీఎఫ్, టీపీటీఎఫ్ మండల బాధ్యులు కృష్ణారావు, పులికాంత శశిధర్, ఖాలీద్‌పాషా, రాజశేఖర్, రాజేశ్, నజీర్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

మెటపల్లిటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని మెటపల్లి సీఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బంగారం, వెండి వ్యాపారస్తులతో బుధవారం స్థానిక సర్కిల్ ఇనెస్పెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో పట్టణంలోని బంగారం షాప్ పరిసర ప్రాంతాలన్నీ అత్యాధునిక సీసీ కేమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, బంగారు షాప్‌ల వర్తక సంఘం అధ్యక్షుడు బెజ్జారపు నవీన్‌కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

మెట్‌పల్లిటౌన్: రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పట్టణంలో తెరిచిన విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు.

- ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాలక్ష్మి అమ్మ, ఐదుచేతుల పోచమ్మ ఆలయంలో యూత్ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు.

కోరుట్ల: పట్టణంలోని వివిధ వార్డులలోని మహిళ సంఘాలకు పట్టణంలోని బయో మైనింగ్ విధానంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్ అవగాహన కల్పించారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్ రాజ రాజేశ్వర ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు.

కొడిమ్యాల: మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలోని పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లోని దేవతలకు అలంకరణ వస్త్రాలను కొండగట్టు గిరిప్రదక్షిణ సభ్యులు అందించారు.

- వర్షాలు కురుస్తున్నందున పత్తి, మొక్కజొన్న, వరినాట్లు వేసిన పంటలలో నిలిచిన నీరు తొలగించడానికి కాల్వలను రైతులు ఏర్పాటు చేసుకోవాలని ఏవో జ్యోతి కోరారు.

ధర్మపురి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు బెక్కం లింగయ్యకు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దామెర రాం సుధాకర్‌రావు 5,200 రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు.

బుగ్గారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండలంలో మరో మూడు ఎంపీటీసీ స్థానాలు పెంచాలని మండల కేంద్రంలోని ప్రజలు ఎంపీడీవో అఫ్జల్ మియాకి వినతి పత్రం అందజేశారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పీజీటీ భౌతికశాస్త్రం అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తిచేసి బీఈడీ చదివిన వారు అర్హులను పేర్కొన్నారు. 26న ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు డెమో నిర్వహిస్తామన్నారు.

ఏపీ జల దోపిడీని అడ్డుకుంటాం

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును నిర్మించకుండా ఏపీ జల దోపిడీని అడ్డుకుని తీరతామని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బనకచర్ల ప్రాజెక్టు వలన తెలంగాణ రాష్ట్రానికి జరిగే అన్యాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టు అక్రమాలపై ముద్రించిన ప్రచార పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నేరెళ్ల మహేష్, ఆవుల సాయి, రాకేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్రాస్ ఐఐటీ కోర్సులకు మద్దునూర్ పాఠశాల ఎంపిక

బుగ్గారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐఐటీ మద్రాసు కోర్సులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఏరోస్పేస్, మాథ్స్ అండ్ కంప్యూటింగ్ కోర్సులు వంటి అంశాలలో ఆన్‌లైన్ కోర్స్‌లు ఉండనున్నాయి. ఎంఈవో వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

రాయికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల సమరంలో ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేసేలా సమన్వయంతో ముందుకు సాగాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో బుధవారం మండల ఎంపీటీసీ పరిధిల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే స్థానిక ఎన్నికల నగారా మోగే అవకావశం ఉన్నందున గ్రామగ్రామాన బీఆర్ఎస్ శ్రేణులు అంతా స్థానిక సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. దీంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసిందని విమర్శించారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటూ అలుపెరుగని పోరాటం చేస్తోందని, దానిలో బీఆర్ఎస్ శ్రేణుల సహకారం మరువలేనిదని అన్నారు. ఇదే స్ఫూర్తితో గడపగడపకు ప్రభుత్వం వైఫల్యాలను తీసుకువెళ్తూ గత పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రలకు క్షేత్ర స్థాయి నుంచి వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బర్కం మల్లేష్; కోఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఉదయశ్రీ, రాణి సాయికుమార్, మాజీ వైస్‌ఎంపీపీ మహేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి కొండపల్కుల రత్నాకర్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సారంగాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలని అందుకు పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వసంత హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా 18 నెలలు గడుస్తున్న మాయమాటలు చెబుతు కాలం గడుపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సాగి సత్యంరావు, మాజీ సర్పంచ్ బైరి మల్లేశం, ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు ప్రభాకర్, ప్రసాద్, జగన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో బోనాల సంబురాలు

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం రోజున బోనాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు ఎత్తుకోగా, విద్యార్థులు పోతురాజు వేషధారణలో ఆరాధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇల్లెందుల ప్రభాకర్, వైస్‌ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు నరేష్ మహేష్, రాజేందర్, ఉజ్వల శ్రీనివాస్, రామ్ కుమార్, శంకర్ శివకుమార్, మానస, సునీత పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్, మల్లాపూర్‌లోని జూనియర్ కళాశాలలో బోనాల పండుగ జరుపుతున్న విద్యార్థులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోనాల పండగను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బండి సత్యనారాయవణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నృత్యాలతో చేశారు. అనంతం విద్యార్థులు బోనం తయారు చేసి సమీపంలోని పోచమ్మ ఆలయంలో సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రజిత, రాజని, రాజేష్, శ్రీనివాస్, రాజేందర్, సంతోష్, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా లింగార్చణ



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక వేదపండితులు రుద్ర నమకం, చమకం, మన్య సూక్తం, లక్ష్మీ సూక్తం, పురుష సూక్తంతో మహా లింగార్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్ర పుష్పం, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలి

కథలాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సూచించారు. మండలంలోని తాండ్ర్యాలలో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా గోపి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ రు. 12 లక్షల కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానం బీజేపీ కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, నరెడ్ల రవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగళి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సన్నాహక సదస్సును విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దుమాల గంగారాం

గొల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల మహాగర్జన సదస్సును విజయవంతం చేయడానికి ఈ నెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సన్నాహక సదస్సుకు విచ్చేయనున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వస్తున్నారని జిల్లా నలుమూలల నుంచి వృద్ధులు, వికలాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం మాదిగ కోరారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షులు చెవులమద్ది రమేష్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

రాయికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాయికల్ మండలం ఇటిక్యాల, బోర్నపల్లి, చింతలూరు, ఒడ్డెలింగాపూర్‌లో బుధవారం ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి లక్కాడి రాజరెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.